# బోగస్ ఓట్లు తొంభై వేలు ..!

- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండలో వెలుగులోకి..
- వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు టీడీపీ కుయుక్తులు
- విచారణ చేపట్టాలని ఈసీకి ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ



**రాయదుర్గం:** దొంగ ఓట్ల ఏరివేతకు రంగం సిద్ధమైంది. ఈ ప్రక్రియపై ఎన్నికల కమిషన్ సీరియస్‌గా కసరత్తు మొదలుపెట్టింది. టీడీపీ హయాంలో ఇష్టారాజ్యంగా బోగస్ ఓట్లు చేర్చారనేది సర్వత్రా చర్చ. ఈ విషయం పై ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆధారాల సహా ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా బోగస్ ఓట్లు తొలగించి తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేసేలా భారత ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ దిశగా బీఎల్‌ఓలు క్షేత్రస్థాయి పర్యటనలో దొంగ ఓట్లు గుర్తించేలా కసరత్తు మొదలుపెట్టారు. టీడీపీ నాయకులు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు 90 వేలకు పైగా బోగస్ ఓట్లు చేర్చినట్టు తెలుస్తోంది. రాయదుర్గంలో 32 వేలకు పైగా దొంగ ఓట్లు నమోదైనట్టు తెలిసింది. వీటిలో ఎక్కువ భాగం షెటిలర్లు, శాశ్వత మైగ్రేట్, డబుల్ ఎంట్రీలు, ఒకే డోర్ నంబర్‌పై అధిక సంఖ్యలో ఓట్లు ఉన్నట్టు గుర్తించారు. మూడు నియోజకవర్గాల్లోనూ తాజా ముసాయిదా ప్రకారం 7,05,592 ఓట్లు నమోదయ్యాయి. ఫారం-6 తో పాటు ఫారం-7, ఫారం-8 లో వచ్చిన క్లెయిమ్‌లన్నీ విచారణ జరిపి వచ్చే ఏడాది 2024 జనవరి 5 నాటికి తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలన్నదే ఎన్నికల కమిషన్ లక్ష్యం. ఈ క్రమంలో తమ అక్రమ భాగోతం ఎక్కడ వెలుగుచూస్తుందోనని టీడీపీ నాయకులు గగ్గోలు పెడుతున్నారు. దొంగ.. దొంగ అంటూ ఆ నెపాన్ని ఎదుటివారిపై నెట్టి తప్పించుకునేలా కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు.

**ఓటమి భయంతోనే అడ్డదారులు**

2014-19 మధ్య కాలంలో అధికారం చేపట్టిన టీడీపీ ప్రజల్లో బలమైన వ్యతిరేకత కూడగట్టుకుంది. నీరు-చెట్టు, ఇసుక, మట్టి కొల్లగొట్టడంతో పాటు సంక్షేమ పథకాల అమలులో లంచాలకు పాల్పడుతూ దోపిడీకి తెరతీసింది. మేనిఫెస్టోలో ఇచ్చిన 610 హామీల్లో మెజార్టీ పథకాలను గాలికొదిలేసింది. ఈ కారణంగా ప్రజల్లో ఆక్రోశాన్ని కలగజేసింది. 2019లో ఓటమిని ముందే గుర్తించిన టీడీపీ నాయకత్వం గెలుపు కోసం అడ్డదార్లు తొక్కింది. ఎన్నికల్లో లబ్ధి పొందేలా వారి అనుయాయులు, పార్టీ సానుభూతిపరులను గుర్తించి వేల సంఖ్యలో ఓటరు జాబితాలోకి పేర్లు చేర్చారన్నది వైఎస్సార్‌సీపీ నాయకుల వాదన. వీటిని తొలగించాలని ఓ పక్క ఫిర్యాదులు చేస్తే, వాటిని కాపాడుకునేలా టీడీపీ కుట్రలు చేస్తూ వచ్చారు. ఒక వ్యక్తికి ఒక ఓటు ఉండాలన్నదే ఎన్నికల కమిషన్ ఆదేశం. డబుల్ ఎంట్రీలు, శాశ్వత మైగ్రేట్, మృతులు, ఇతర రాష్ట్రాల్లో స్థిరపడ్డవారికి అధికారులు ఇప్పటికే పలు దఫాలుగా నోటీసులు కూడా జారీ చేశారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేక తిరిగి కార్యాలయానికే వచ్చి చేరుతున్నాయి. ఇలాంటి వాటిపై చర్య తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. ఈ విషయంపై ఆర్‌ఓ అరుణకుమారి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డబుల్ ఎంట్రీలు, దొంగ ఓట్లు ఉంటే తొలగిస్తామన్నారు. ఈ విషయం లో విమర్శలకు తావివ్వకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తామన్నారు.

**ఓటర్ల ముసాయిదా ఇలా..**

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | మొత్తం ఓటర్లు |
|---|---|---|
| రాయదుర్గం | 296 | 2,58,826 |
| కళ్యాణదుర్గం | 261 | 2,28,125 |
| ఉరవకొండ | 259 | 2,18,609 |

## నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

- హాజరుకానున్న ప్రభుత్వ విప్

**రాయదుర్గం/టౌన్:** స్థానిక పురపాలక సంఘం పరిధిలోని వివిధ వార్డుల్లో ఇటీవల పూర్తయిన అభివృద్ధి పనులకు సంబంధించి ఆదివారం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డితోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు, కౌన్సిల్ సభ్యులు హాజరవుతారన్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటలకు వరకూ ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పట్టణంలోని 10వ వార్డు ఓంశాంతి వద్ద సీసీ రోడ్డు, గంట చర్చి వద్ద వాటర్ ట్యాంక్, గుగ్గిరొట్టి ఏరియాలో వాటర్ ట్యాంకు, 19వ వార్డు మొలకాల్మూరు రోడ్డులో వాటర్ ట్యాంకు, 20వ వార్డు పైతోట లో వాటర్ ట్యాంకులను విప్ ప్రారంభిస్తారన్నారు.

## అక్కమాంబ ఆలయంలో రేపు అఖండ జ్యోతి

**కళ్యాణదుర్గం:** కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా పట్టణంలోని అక్కమాంబ ఆలయంలో ఈనెల 11న అఖండ జ్యోతి ప్రజ్వలన, ఊయల ఉత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6 గంటలకు మహాగణపతి హోమం, 7 గంటలకు శివలింగానికి అభిషేకం, 10 గంటలకు నాగులకు అభిషేకం, మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటలకు అక్కదేవతల కలశ ప్రతిష్ట, 6.15 గంటలకు కొండపై అఖండజ్యోతి ప్రజ్వలన, ఊయల ఉత్సవం, మహామంగళహారతి, తీర్థ ప్రసాదాల పంపిణీ చేపడతామన్నారు. పూజా కార్యక్రమాలలో పాల్గొని ధన, ధాన్యరూపేణ సహకరించే దాతలు రఘుస్వామి(9963677288), మఠం శ్రీకాంత్(9866416141), వన్నూరుస్వామి(6300885917), సుబ్బారెడ్డి(6304251995)ని సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

## క్లుప్తంగా

### ఎమ్మెల్సీకి ప్రముఖుల పరామర్శ



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని పరామర్శిస్తున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తదితరులు

**వజ్రకరూరు:** మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని పలువురు ప్రముఖులు పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్సీ సతీమణి వై.ఉమాదేవి గురువారం అనారోగ్యంతో మృతిచెందిన విషయం విదితమే. శనివారంతాడిపత్రి, మడకశిర ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, తిప్పేస్వామి, అహూడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, అనంతపురం మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు నవీన్‌నిశ్చల్, పలువురు ఉన్నతాధికారులు కొనకొండ్లకు వెళ్లి ఎమ్మెల్సీతో పాటు కుమారుడు వై.భీమిరెడ్డిని పరామర్శించారు.

### ‘ఉపాధి’ పనిదినాలు పెంచాలి

**రాయదుర్గంటౌన్:** ఉపాధి పథకం పనిదినాలు పెంచాలని సీపీఐ రాయదుర్గం కార్యదర్శి నాగార్జున కోరారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద కుటుంబాలకు 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 14న విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం మహా ధర్నాను జయప్రదం చేయాలన్నారు.

### మాతాశిశు సంరక్షణే ధ్యేయం



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**కూడేరు:** కూడేరు: మాతాశిశు మరణాలను నిర్మూలించాలన్నదే ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన ధ్యేయమని మండల వైద్యాధికారిణి సౌమ్యరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకంలో భాగంగా గర్భిణులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల వైద్యాధికారిణి వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. హైరిస్కు గర్భిణులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం గర్భిణులకు ఎస్‌ఐ సత్యనారాయణ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వరలక్ష్మి, సూపర్ వైజర్ రవీంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### తక్షణసాయం అందజేత

**కళ్యాణదుర్గం రూరల్:** మండలంలోని బోయలపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి నాగరాజు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. వెంటనే మృతుని భార్య కాంతమ్మకు అధికారులు వైఎస్సార్‌బీమా తక్షణ సాయం కింద శనివారం రూ.10,000 అందజేశారు. మిగిన రూ.90,000 నామినీ ఖాతాకు జమవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతురాయుడు, మల్లన్న, జైపాల్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎలుగుబంటి కలకలం



పహారా నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు

**బ్రహ్మసముద్రం:** మండలంలోని పిల్లలపల్లి సమీపంలోని పొలాల్లో ఎలుగుబంటి కలకలం రేపుతోంది. మూడు రోజులుగా పంట పొలాల్లో చొరబడి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. దీంతో రైతులు పొలాల్లోకి వెళ్లాలంటే భయపడుతున్నారు. కొందరు రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు షానావాజ్ , సుబ్రమణ్యం, సిబ్బందితో ఎలుగు బంటి సంచరిస్తున్న ప్రాంతాలకు చేరుకుని పహారా నిర్వహించారు.

### ఏకాగ్రతతో ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు

**ఉరవకొండ:** నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఫలితాల్లో మంచి మార్కులు సాధించాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు సూచించారు. శనివారం నియోజకవర్గంలోని సంక్షేమ వసతి గృహాల్లో పదోతరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఉరవకొండ సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులతో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామన్నారు. ఏఎస్‌డబ్ల్యూఓ మాట్లాడుతూ మంచి ఫలితాల సాధన కోసం హాస్టల్ వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు దావూద్, గంగాధర్, తులసి, వార్డెన్లు జగన్నాథ్, ఓబులయ్య, ధనుంజయ, సుగుణమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

## లో ఓల్టేజీ సమస్య పరిష్కారం



75 వీరాపురంలో సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

**గుమ్మఘట్ట:** 11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభమవడంతో లో ఓల్టేజీ సమస్య పరిష్కారమైందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని 75 వీరాపురం గ్రామంలో రూ.మూడు కోట్ల వ్యయంతో నిర్మించిన సబ్ స్టేషన్‌ను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆపరేషన్ డీవైఈఈ శ్రీనివాసనాయుడు, ఈఈ శేషాద్రిశేఖర్‌తో కలసి విప్ ఆవిష్కరించారు. విప్ మాట్లాడుతూ 75 వీరాపురం, జె.వెంకటంపల్లి, పూలకుంట, బీటీపీ లేఅవుట్ ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. సబ్‌స్టేషన్ నెలకొల్పడంతో రైతులు, గృహ వినియోగదారులకు ఉపయోగకరమన్నారు. విద్యుత్ సమస్యలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందన్నారు. లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, బేలోడు సర్పంచ్ కోట్ల ఉమేష్, మార్కెట్ యార్డు చైర్మన్ భోజరాజ్‌నాయక్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్టీ కాంతారెడ్డి, ఏఈ బాలచంద్ర, బేలోడు రామాంజనేయులు, నాగిరెడ్డి, ఎర్రిస్వామి, రవి, భంభంస్వామి, గోపాల్, రుద్రరెడ్డి, లోకేష్, టీ శివ తదితరులు పాల్గొన్నారు.

## రాజీమార్గానికి వేదిక ‘లోక్ అదాలత్’





రాయదుర్గం, కళ్యాణదుర్గంలో మాట్లాడుతున్న జడ్జిలు సుజన్‌కుమార్, సుభాన్

**రాయదుర్గంటౌన్:** రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకునేందుకు అత్యుత్తమ వేదిక ‘జాతీయ లోక్ అదాలత్’ అని ఇన్‌చార్జ్ జడ్జి జె.సుజన్‌కుమార్ సూచించారు. శనివారం రాయదుర్గం కోర్టులో ఇన్‌చార్జ్ జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ ఆధ్వర్యంలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్ తదితర కేసులకు లోక్ అదాలత్‌లో శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందన్నారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

**ప్రతి ఒక్కరూ క్షమాగుణంతో మెలగాలి**

**కళ్యాణదుర్గం:** ప్రతి ఒక్కరూ తోటివారిపై క్షమాగుణంతో మెలగాలని కళ్యాణదుర్గం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి 674 కేసులు పరిష్కరించారు. జడ్జి మాట్లాడుతూ క్షణికావేశంతో తీసుకునే నిర్ణయాలతో డబ్బు, కాలం వృథా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లతో కక్షిదారులను సమన్వయ పరిచి కేసులలో రాజీ చేయడమే తమ ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.శ్రీనివాసులు, పీపీఏ విఠల్‌రావు, రూరల్ సీఐ నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేంద్ర, శాశ్వత అధ్యక్షుడు కరణం తిప్పేస్వామి, లోక్‌అదాలత్ కమిటీ సభ్యులు దాదాఖలందర్, ముత్యాలప్ప, ఎస్‌ఐలు యువరాజ్, పరుశురాముడు పాల్గొన్నారు.



ఉరవకొండ: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

**354 కేసుల పరిష్కారం**

**ఉరవకొండ:** ఉరవకొండ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి ఆధ్వర్యంలో జరిగిన లోక్‌అదాలత్‌లో 8 క్రిమినల్ కేసులు, 60 ఎక్సైజ్ కేసులు, సివిల్-3, బ్యాంకు కేసులు-20, బీఎస్ఎన్ఎల్-4, పెట్టీ కేసులు-259 మొత్తం 354 కేసులు పరిష్కారించారు. వీటి ద్వారా రూ 20,3 2, 430 ఆదాయం సమకూరింది.

## సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



కంబదూరులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

**కంబదూరు:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మంజూరైన నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శనివారం మంత్రి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తోందదన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు జగనన్న ప్రభుత్వం సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులను మంజూరు చేస్తోందన్నారు.ఆ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు దేశం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని వచ్చే ఎన్నికల్లో కూడా ఆశీర్వదిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, పార్టీ మండల కన్వీనర్ బాలరాజు, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీలు మీసేవ కుమార్, మల్లేష్, కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్, నాయకులు మల్లూరి వెంకటేశులు, మాబూబ్‌సాబ్, రామస్వామి, విల్సన్, రాజు, కిరణ్, క్రాంతి, అబ్బాస్, దాదు, కొడతల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవం .. కార్తీక దీపోత్సవం

**రాయదుర్గం రూరల్/ఉరవకొండ/కూడేరు/వజ్రకరూరు:** రాయదుర్గం మండలంలోని మల్లాపురం గ్రామం వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు శ్రీరామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించారు కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బీఎస్ తిప్పేస్వామి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అలాగేమండలంలోని వడ్రహొన్నూరు గ్రామ సమీపంలో వెలిసిన అపులాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీనివాస్ బాబా పర్యవేక్షణలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో ధ్వజస్తంభంపై కార్తీక దీపోత్సవం నిర్వహించారు. అలాగే ఉరవకొండలోని పాతపేట ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా కూడేరు మండలంలోని బసాపురం, కూడేరు, రామదుర్గం ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వజ్రకరూరు మండల కేంద్రంలోని జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని శివాలయాలతో పాటు ప్రముఖ ఆలయాల్లో కార్తీక మాసోత్సవ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వస్తున్నారు. కార్తీక మాసం చివరి శనివారం పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో పేర్మి వంశీయుల ఆధ్వర్యంలో స్వామి వారికి కార్తీక పూజలు జరిగాయి. సాయంత్రం కార్తీక దీపోత్సవం, పల్లకి సేవలతో పాటు జ్వాలాతోరణాన్ని నిర్వహించి మొక్కులు మొక్కులు తీర్చుకున్నారు.



లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మార్కండేయస్వామి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న భక్తులు

## రక్తదానం .. మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకుడు

**రాయదుర్గం రూరల్:** ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలని అపులాపురం ఆంజనేయస్వామి ఆలయ పరిరక్షకుడు శ్రీనివాస్ బాబా అన్నారు. మండలంలోని వడ్రహొన్నూరు సమీపాన వెలిసిన అపులాపురం ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 55 మంది యువకులు రక్తదానం చేసి తమ సేవాగుణాన్ని చాటుకున్నారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వడ్రహొన్నూరు ఎంపీటీసీ అరుణ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ‘ఉపాధి’ కింద పూడికతీత పనులు

**వజ్రకరూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి పథకం కింద పూడికతీత పనులు పనులు చేపడుతున్నట్లు ఏపీఓ లక్ష్మీకాంతబాయి తెలిపారు. శనివారం మండలంలోని వజ్రకరూరు, వెంకటాంపల్లిపెద్దతండా, జరుట్లరాంపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 660 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారన్నారు. 2000 మంది కూలీలకు పనులు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

## ధ్యాన కేంద్ర వార్షికోత్సవం

**ఉరవకొండ:** పట్టణంలని లోబ్‌సాంగ్ రాంపా పిరిమిడ్ ధ్యాన కేంద్రం 30వ వార్షికోత్సవ ధ్యాన సంబరాల్లో భాగంగా శనివారం శాఖహర ర్యాలీ నిర్వహించారు. ధ్యానకేంద్రం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితం కోసం ధ్యానం చేయడంతో పాటు శాఖాహారం తీసుకోవాలన్నారు. అనంతరం పిరిమిడ్ ధ్యాన కేంద్రంలో ధ్యానం మొక్క విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా అమ్మతొలి దైవం సంస్థ ఆధ్వర్యంలో కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు నిర్వహించారు.

## ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా సామగ్రి పంపిణీ

**ఉరవకొండ:** ఆడుదాం ఆంధ్రా పోటీలకు సంబంధించి ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా సామాగ్రిను శనివారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప ఆయా ప్రభుత్వ పాఠశాలలకు అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని 19 సచివాలయల పరిధిలో ఈ నెల 15 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఎస్‌కే ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో పోటీలకు సర్వం సిద్ధం చేశామన్నారు. క్రికెట్ కిట్లు, వాలీ బాల్స్, నెట్, షటిల్ రాకెట్స్, బారెల్స్, రింగ్స్ సామగ్రి పంపిణీ చేశామన్నారు.

## సంక్షిప్త సమాచారం

**దివ్యాంగ సమస్యలపై వినతి**

**కుందుర్పి:** గ్రామ సచివాలయాల్లో పనిచేసే దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాల ని కోరుతూ శుక్రవారం మంత్రి ఉషశ్రీచరణ్‌కు వినతి పత్రం అందజేశారు. దివ్యాంగులకు ఇస్తున్న కన్వెయన్స్ అలవెన్స్‌ను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచాలని, ఆధార్ సెంటర్స్ నుంచి మినహాయించాలని, డిజెబులిటీ యాక్ట్‌ను సంపూర్ణంగా అమలు చేయాలనే సమస్యలపై మంత్రి కార్యాలయంలో విన్నవించారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు కార్యవర్గ సభ్యులు బొజ్జప్ప, ముకుంద, లక్ష్మీదేవి, సునీత, రామలక్ష్మి తదితరులున్నారు.

**కొనసాగుతున్న ‘వికసిత్ సంకల్పయాత్ర’**

**బ్రహ్మసముద్రం:** మండలంలోని బొమ్మగానిపల్లి, కన్నేపల్లి గ్రామాల్లో శనివారం ఏఓ నంద కిశోర్ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పథకాలపై ప్రజలకు డిజిటల్ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఓబుళపతి, వైస్ ఎంపీపీ వెంకటేశ్‌నాయక్ , సర్పంచ్‌లు గంగమ్మ, ఆదినారాయణ రెడ్డి, బీజేపీ నాయకులు ఆంజనేయులు, రామదాసు, పంచాయతీ కార్యదర్శులు వెంకటరాముడు, మల్లికార్జున, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు ‘డయల్ యువర్ డీఎం’**

**రాయదుర్గంటౌన్:** రాయదుర్గం ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలపై ‘డయల్ యువర్ డీఎం’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం సురేష్ కుమార్ శనివారం తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటలకు వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందన్నారు. 9959225863 నంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు సలహాలు, సూచనలు అందజేయాలన్నారు.

**ఉచిత వైద్య శిబిరానికి స్పందన**

**కుందుర్పి:** మండలంలోని మందలపల్లిలో శుక్రవారం భంభంబాబా గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని సవీరా ఆస్పత్రి వైద్యులు హాజరై గుండె, కిడ్నీ తదితర రకాల రోగాలకు సంబంధించి 120 మందికి చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అతావుల్లా, మహిళా సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**క్రీస్తు జననం లోకానికి వెలుగు**

**కళ్యాణదుర్గం రూరల్:** ఏసుక్రీస్తు జననం లోకానికి వెలుగు అని ప్రవక్త జోసెఫ్ అన్నారు. శనివారం కళ్యాణదుర్గం అగాపే కల్వరి చర్చిలో ఏర్పాటు చేసిన రెండు రోజుల సువార్త ఉజ్జీవకుటలలో ప్రసంగించడానికి విశాఖపట్నానికి చెందిన దైవజనులు ప్రవక్త జోసెఫ్ కాకర ప్రసంగించారు. కార్యక్రమంలో ఉత్తమ సామాజిక సేవ అవార్డు గ్రహీత చల్లా కిషోర్, చర్చి కమిటీ అధ్యక్షులు చల్లా రాజశేఖర్, రోజ్లీ రాజేష్, పాస్టరమ్మ, పుష్ప, పాస్టర్లు రూబెన్, శాంతరాజు, జాన్‌పాల్, సంతోష్ పాల్గొన్నారు.

**కంబదూరు:** క్రీస్తు పుట్టుక లోకానికి వెలుగు అని అంతర్జాతీయ ప్రసంగీకుడు రెవరెండు జేమ్స్ ఫిలిప్ అన్నారు. మండలంలోని గుద్దెళ్ల, మర్రిమాకులపల్లిలో శనివారం పాస్టర్ల సదస్సు, సభలను పాస్టర్ జయరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బిషప్ జాన్సన్‌బాబు, రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవ అవార్డు గ్రహీత చల్లాకిషోర్, పాస్టర్ డేవిడ్, పాస్టరమ్మ రీట జాన్సన్, ధనరాజ్, జాన్‌పీట,అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

**మరుగుదొడ్లు నిర్మించాలని వినతి**

**కుందుర్పి:** మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ కూడలిలో మరుగుదొడ్లు నిర్మించాలని శుక్రవారం ఎంపీడీఓ లక్ష్మీనరసింహకు వివిధ గ్రా మాలకు చెందిన మహిళా సంఘ సభ్యులు వినతిపత్రం అందజేశారు. వివిధ పనుల నిమిత్తం కెనరా బ్యాంకు, మండల రిసోర్స్ సెంటర్‌కు ఎక్కువ మంది వస్తుంటామని, మరుగు దొడ్లు లేని కారణంగా తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నామని వారు వాపోయారు.

**రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు**

**కూడేరు:** మండలంలోని లెప్రసి కాలనీ శివారు ప్రాంతంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై శనివారం ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంలో ఉన్న రాకేష్ గాయపడ్డాడు. అనంతపురానికి చెందిన రాకేష్ ద్విచక్ర వాహనంలో ఉరవకొండకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. అతడిని వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

**నేడు కనకదాస జయంత్యుత్సవాలు**

**బొమ్మనహాళ్:** మండల కేంద్రంలో భక్త కనకదాస జయంత్యుత్సవాలను ఆదివారం నిర్వహిస్తున్నట్టు భక్త కనకదాస కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక రేవణ సిద్దేశ్వర కంబళ్ల సొసైటీ వద్ద నుంచి కనకదాస చిత్రపటంతో గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కురుబలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ఓటరు నమోదు పక్కాగా నిర్వహించాలి

**వజ్రకరూరు:** ఓటరు నమోదును పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు, అభ్యంతరాల పరిశీలన తదితర అంశాలపై సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

